


# వెయ్యినోటు

చిన్నప్పటి నుండి రెపరెప లాడే సరికొత్త కరెన్సీ నోట్లను సేకరించి పదిలంగా దాచుకోవడం నా హాబీ. నా వయసుతో పాటు నా హాబీ కూడా క్రమంగా పెరిగిందే తప్ప ఏ మాత్రం తగ్గలేదు. ఏ వస్తువుకొన్నా పర్సులో ఉన్నవాటిల్లో బాగా నలిగిన నోట్లను ముందుగా ఖర్చు చేస్తూ తళుక్కున మెరిసే కొత్త నోట్లను వెనకేస్తూ దాచి ఉంచడం అనే అలవాటు నాకు అరవై ఏళ్ళు దాటుతున్నా నేటికీ పోలేదు.

పాతదైనా కొత్తదైనా వందనోటు విలువ వంద రూపాయలే తప్ప నూటొక్క రూపాయలెవరూ ఇవ్వరు సుబ్బారావ్- అని మిత్రబృందం వేళాకోళం చేసినా నేనుగాని, నా హాబీగాని ఏమాత్రం సిగ్గుపడలేదు.

చిన్నప్పుడు అమ్మో, నాన్నో ఇచ్చిన పది, ఇరవై పైసల నాణేలు కూడబెట్టి ఒక రూపాయి నోటుకో లేక రెండు రూపాయల కొత్త కరెన్సీ నోటుకో చిల్లర ధారబోసి భద్రంగా నెమలిఈకల తోపాటు ఈ కరెన్సీనోట్లను పుస్తకాల మధ్యలో నలగకుండా అతిభద్రంగా దాచడం; కనీసం రోజులో ఒక్కసారయినా అవి భద్రంగా ఉన్నాయో లేదోనని సరిచూసుకొని ఓ పిల్ల జమిందారులాగా ఫీలయిన రోజులు నాకిప్పటికీ మరపురాని చిన్ననాటి మధురస్మృతులు.

★ ★ ★

నాలుగు దశాబ్దాల క్రిందటి మాట. బడిపంతులుగా నా నెల రోజుల కొలువుకు, సేవకు అంది వచ్చిన ప్రతిఫలం అక్షరాలా రెండు వందల పదహారు రూపాయలు. అందులో రెండు కొత్త వంద రూపాయల కరెన్సీ నోట్లు. అప్పుడే బ్యూటీ క్లినిక్‌లో ముస్తాబై వచ్చిన అందమైన ఆడపిల్లల్లా తళతళా మెరిసిపోతూ పిటపిటలాడుతున్నాయ్. బహుశా తొలిసారి నా స్వంత ఆస్తిగా కొత్త వందనోట్లతో నా జేబులో చేరి నాకు కొంత గౌరవాన్నీ, కాస్తంత గర్వాన్నీ తెచ్చిపెట్టాయి.

జీతం అందుకొని బస్సులో ఇంటిముఖం పట్టాను. బస్సు గమ్యం చేరేలోగానే కనీసం నా అందాల వంద నోట్ల మహారాణులను ఎన్నిసార్లు చూసానో గుర్తులేదు. పెళ్లిచూపుల్లో ఎదురుగా ముస్తాబై కూర్చున్న పెళ్ళికూతురి కన్న ఎక్కువ సార్లే చూసుంటానని మాత్రం చెప్పగలను.

ఇంకా బ్రహ్మచారిని. అందులోనూ తొలి జీతం. కనీసం సగమైనా నాన్నకు పంపితే...? ఆలోచన మంచిదే! కానీ ఆచరణ దగ్గరకు వచ్చేసరికి కొత్త కరెన్సీ నోటు మీద వున్న మోజు కొత్త నోటును త్యాగం చేయడానికి మనస్సెంత మాత్రం అంగీకరించడం లేదు. తొలి వలపులా తొలి సంపాదన కూడా నిన్ను వదలి నేను పోలేనులే అంటూ మారాం చేయడంతో ఆ నెల సంపాదన ఏమాత్రం నలగకుండా భద్రంగా దాచే నా సర్టిఫికెట్ల ఫైల్ ఫోల్డర్లో ఠీవిగా చోటుచేసుకున్నాయి.

రెండింటిలో ఒక వంద నోటును నెలసరి ఖర్చులకోసం మార్చక తప్పలేదు. రెండోనెల సంపాదన చేతికొచ్చేవరకూ తొలి సంపాదనలో మిగిల్చిన వందనోటునే మనసుకు నచ్చి, మెచ్చిన ప్రేయసి ఫోటోనే పదే పదే బయటకు తీసి చూస్తూ మురిసిపోయినట్లు ఆ కొత్త వంద నోటును చూస్తూ మైమరచిన మధురక్షణాలు ఎప్పటికీ మరచిపోలేనివి. నా సర్వీస్ మొత్తమంతా ఖర్చులు పోను మిగలేది తక్కువే అయినా మిగిలిన ఆ కాస్త మొత్తాన్నీ బ్యాంక్ ఇచ్చే స్వల్ప వడ్డీని నా హాబీ కోసం త్యాగం చేసి మరీ ఐదు, పది, వంద డినామినేషన్లలో చిన్న చిన్న కట్టలుగా బీరువా ఇన్నర్‌లాక్‌లో పేర్చుకొని అవి చూస్తూ పొందే తృప్తి నా మాటల్లో చెప్పలేనిది.

★ ★ ★


కలియుగంలో కాలచక్రం మరీ స్పీడుగా తిరుగుతుందో ఏమో! ముప్పై ఐదేళ్ల సర్వీస్ ఇట్టే గడిచిపోయింది. అప్పుడే రిటైరై రెండేళ్ళు పూర్తయ్యాయి. అరవై ఏళ్ళు నిండాయి. అయినా నేను తలకు నల్లరంగు పులుముకొంటూ, పండు మీసం పూర్తిగా గొరిగేసి నా ప్రతిబింబం అద్దంలో చూసుకొంటూ, ఇంకా యువకుడినని, కొత్త కరెన్సీ నోటులాగ ఫెళ, ఫెళ లాడుతున్నాననే భ్రమను నాకు నేనే కల్పించుకొని, చుట్టూ మసిలే జనం కూడా అలానే భావిస్తూ ఉండవచ్చనే భ్రాంతి భావంతో మసులుకోవడం అలవాటైపోయింది. అయితే మాసిపోయిన పాతనోటుని సబ్బునీళ్లతో కడిగి ఆరబెట్టి, ఇస్త్రీ పట్టి కొత్తనోటని మురిసిపోయేందుకు చేసే ప్రయత్నం మాత్రమేనన్న నిజం నాకు, మా ఆవిడకు మాత్రమే తెలిసి ఉండవచ్చునన్నది నా అవివేక ప్రభావన. మా ఆవిడ మాత్రం జుత్తంతా ముగ్గుబుట్టలా చేసుకొని, చొక్కు దవడలతో అవ్వలా తయారయింది. లేక, లేక పుట్టిన పుత్రరత్నం ఉద్యోగం వేటలో దేశమంతా తిరుగుతున్నాడు.

నా సర్వీస్ ఆరంభం నుండీ అంతంవరకూ నాకు అంతుబట్టని ఆనందం ఒక్కటే ఒక్కటి. అది మూడు డిజిట్ల జీతంతో ఉద్యోగంలో చేరిన నేను ఐదు డిజిట్ల పెన్షన్ అందుకోవడం. పెరుగుతున్న ధరల ఆకాశాన్ని రెండో కాలితో అందుకోవడానికి వేతన సవరణ వామనుడు క్రమంగా చేస్తూ వస్తున్న వ్యర్థ ప్రయత్నమే దీనికి కారణం కావచ్చు. నేటి నా పెన్షన్ పదివేల రూపాయలు.







అంటే నే చేరినప్పటి జీతానికి ఏభై రెట్లు ఎక్కువన్నమాట. ఫోర్ డిజిట్ సేలరీ తెచ్చుకొంటున్న అధికారి కంటబడితే దివి నుంచి భువికి దిగి వచ్చిన మానవాతీతుడిగా చూసిన రోజులు చూసిన నాకు, ఫైవ్ డిజిట్ పెన్షన్ పొందుతున్న ఉన్నతస్థాయికి చేరిన నాకు అనిర్వచనీయమైన ఆనందం, గర్వం కూడా! రిటైరైనప్పటి నుండి ప్రతి నెలా బ్యాంక్‌కి వెళ్ళడం, ముక్కిపోయినా నోట్ల కట్ట పెన్షన్‌గా తెచ్చుకోవడం ఆనవాయితీగా మారిపోయింది.

మా ఊరు పెద్ద పల్లెటూరు. మా వూరి బ్యాంక్‌లో కొత్తనోట్లు చూసిన సందర్భాలు లేవనే చెప్పాలి. రెపరెపలాడే కొత్త వెయ్యిరూపాయల నోటు ఒక్కటైనా నా బీరువా షెల్ఫ్‌ను అలంకరించాలన్నది నా ప్రగాఢమైన కోరిక. నా కోరికను తీర్చేందుకేనన్నట్టు మా బ్యాంక్‌కూ ఏ.టి.ఎం గడిచిన సంవత్సరమే మంజూరైంది. ఇక నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే బ్యాంక్ మేనేజర్‌ను కలిసి ఎ.టి.ఎం కార్డుకు దరఖాస్తు చేయడం, మరుసటి నెలలోనే ఎ.టి.ఎం. కార్డు రావడం, ఒకదాని వెంబడి మరొకటి జరిగిపోయాయి. అప్పటి నుండి ప్రతి నెలా ఎ.టి.ఎం.లో వచ్చిన ప్రతి వెయ్యి రూపాయల నోటును ప్రాణానికి ప్రాణంగా దాచుకొంటూ ముప్పై నోట్ల వరకు పోగేసి నా రంగుల స్వప్నం నిజమైనందుకు నా భుజాలు నేనే చరుచుకొన్నా!

ముప్పై ఏళ్ళ జీవితంలో ఎప్పుడూ ఐదు వందలకు మించి మా ఆవిడకు చీరకొన్న గుర్తు లేదు. ఆ నెల పదిహేనవ తారీఖు మా పెళ్ళిరోజు. పైగా షష్టిపూర్తి సంవత్సరం. నా వెయ్యి నోట్ల నిధిని కదిలించక తప్పని పరిస్థితి. ముప్పై వెయ్యి నోట్ల కట్ట మధ్యలోనుంచి సుతారంగా ఒకే ఒక్క నోటును తీసి నలగకుండా పుస్తకం మధ్యలో భద్రంగా ఉంచి బట్టల దుకాణానికి బయలుదేరాను. మా ఆవిడ సాధారణంగా నచ్చుకొనే రంగులో వెయ్యి రూపాయల పట్టు చీరను ఎంచి బిల్లు చెల్లించడానికి కౌంటర్ వద్దకు చేరాను. నేనిచ్చిన వెయ్యి రూపాయల నోటును అటూ, ఇటూ తిప్పి చూసి, నన్ను ఎగాదిగా ఓ దొంగవెధను చూసినట్టు చూసి ఇంకా మిగిలి ఉన్న సందేహం తీర్చుకొనేందుకు టేబుల్‌పై గాజుపలక కింద నున్న ఓ పేపర్ కటింగ్‌లో నున్న సిరీస్‌లను, నెంబర్లను పరికించి అది ఒక ఫేక్ నోటని చావుకబురు చల్లగా చెప్పాడు. పైగా ఇలాంటి దొంగ నోట్ వారి దృష్టికి వస్తే పోలీసులకు తెలియజేయవలసి వుంటుదన్న నీతి సూత్రాన్నీ, పౌరధర్మాన్నీ బోధించాడు. ఎప్పుడూ ఇవి పిల్లలకు చెప్పడమేగాని ఒకరు చెబితే వినే దౌర్భాగ్య స్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

బ్యాంక్ ఏ.టి.ఎమ్‌లో వచ్చిన నోటని ఎంత నచ్చచెప్పినా వినలేదు సరికదా ఈ మాటేదో ఆ బ్యాంక్ మేనేజర్‌తోనే మొరపెట్టుకోండని ఓ ఉచిత సలహా ఇవ్వడంతో ఊరుకోకుండా; ఒక అపరాధిని మానవతా దృక్పథంతో క్షమించి పోలీసులకు ఈ విషయం చెప్పనందుకు మెచ్చుకోలుగా నా నుండి థ్యాంక్స్ అనే మాటను ఆశించిన ఫేస్‌తో కొన్న చీరను వెనక్కు తీసుకొని వదిలి పెట్టాడు కేష్ కౌంటర్లోని ధర్మారావు. చెయ్యని తప్పునకు భరించవలసి వచ్చిన అవమానభారంతో, చుట్టూవున్న పెద్ద మనుషులు నన్నో అపరాధిగా వింత

చూపులు చూస్తుంటే ఏం చేయాలో దిక్కుతోచని అయోమయ స్థితిలో దుకాణంలోంచి బయటపడ్డాను. అవమాన భారం ఒక వంక, హాబీ మోజులో దాచి ఉంచిన మిగిలిన ఇరవై తొమ్మిది నోట్ల భవిష్యత్తుపై శంక మరోవంక ఆ రాత్రంతా నాకు నిద్రలేకుండా చేసాయి.

మరుసటి రోజు బ్యాంక్ తెరిచే సమయానికే అక్కడకు చేరుకొని వెయ్యి రూపాయల నోటును బ్రాంచ్ మేనేజర్‌కి చూపిస్తూ ''ఇది నాకు నెల, నెలా వచ్చే పెన్షన్‌తో వచ్చిన వెయ్యి రూపాయల నోట్ సార్! ఈ నోట్ దొంగ నోటని, ఇది చెల్లదని బట్టల షాప్ కౌంటర్లోని కేషియర్ చెప్పడంతో విషయం మీకు తెలియజేయాలని వచ్చాను. పరిశీలించి తగిన న్యాయం చేయండి అన్నాను'' వినమ్రంగా చేతులు జోడించి మరీ.


వెయ్యి రూపాయల నోటును అటూ ఇటూ తిప్పి సిరీస్, నెంబర్ వైగైరాలన్నీ పరిశీలించి ముఖ కవళికలను మార్చి నన్నొక దొంగలా అనుమానిస్తున్న భావాలను ముఖంలో జోడించి 'చూడండీ! నేను ఈ బ్రాంచ్‌కి మేనేజర్‌గా వచ్చి ఆరు నెలలౌతోంది. మేము ఏ.టీ.ఏం.లో మనీ పెట్టేటప్పుడే ఒకటికి రెండుసార్లు ఫేక్ నోట్లేమైనా ఉన్నాయో లేదోనని చెక్ చేసి మరీ కేష్ ఉంచుతాం. మరి గత ఆరు నెలలుగా ఎవ్వరినుంచీ లేని కంప్లైంట్ మీ దగ్గరి నుండి మాత్రమే వచ్చిందంటే మిమ్మల్ని సందేహించవలసి వస్తుంది. ఇంతకీ ఈ నోటు ఏ నెలలో మీకు ఏ.టి.ఎం.లో వచ్చింది? ఇంకా ఇలాంటి ఫేక్ నోట్లు తమ వద్ద ఎన్ని ఉన్నాయి? వివరాలతో కంప్లైంట్ రాసి ఇవ్వండి. మేం పోలీస్ రిపోర్ట్ ఇచ్చి ఎంక్వైరీ చేయిస్తాం. ఇందులో మీ ప్రమేయం ఏమీ లేదంటే ఓకే. లేకపోతే మీ మీద కూడా పోలీస్‌లు తగిన చర్య తీసుకోవచ్చు. ఏది ఏమైనా మీరు మాత్రం పోలీసులకు సహకరించడానికి సిద్ధంగా ఉండండి. ఇక మీరు వెళ్ళొచ్చు'' తీవ్ర స్వరంతో హుంకరించాడు బ్రాంచ్ మేనేజర్.

ఆ మాటలు విన్న నాకు మిన్ను విరిగి మీదపడ్డట్టు, భూమిలోకి నేను కృంగిపోతున్నట్టు, శరీరమంతా ముచ్చెమటలతో కళ్ళు బైర్లు కమ్మినట్లైంది. మరొక్క క్షణం కూడా అక్కడ ఉండబుద్ధి కాలేదు. న్యాయం జరగలేదు సరికదా నేనేదో అపరాధం చేసినట్టు రిపోర్ట్ రాసి ఇవ్వమనడంలో అర్థం లేదనిపించి హుటాహుటిన ఇల్లు చేరుకొన్నాను. మిగిలిన ఇరవై తొమ్మిది నోట్లలో ఈ బాపతుకి చెందినవెన్నో పోలీసులు రైడింగ్‌కి వచ్చి సోదా చేస్తే...? ఇందులో కూడా ఫేక్ నోట్లుంటే? మనసు పరి పరి విధాలపోయింది.

ఈ తప్పెవరిది? విచ్చలవిడిగా దొంగనోట్లు చెలామణీ అవుతున్నా తగిన చర్యలు తీసుకోలేకపోయిన సర్కారుదా? కనీసం ఎ.టి.ఏమ్‌లో కేష్ ఉంచే ముందు ఈ దొంగనోట్లను గుర్తించని బ్యాంక్ అధికారుల అలసత్వమా? లేక నిత్యం న్యూస్ పేపర్లో వస్తున్న ఈ ఫేక్ నోట్ల వార్తలను చదివి కూడా జాగ్రత్తపడని నా అవివేకమా? నా మదిని దొలిచిన సమాధానం లేని ప్రశ్నలివి.

ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తిలో నిష్కళంకమైన పెద్దమనిషిగా సమాజంలో ప్రత్యేకమైన గౌరవ మర్యాదలతో ప్రాణధనం కంటే మానధనం మిన్నగా బ్రతుకుతున్న నాకు ఈ చేయని తప్పు, నా మీద పడిన అపనింద మానసికంగా నన్నెంతో కృంగదీసింది. నాలో ఆలోచనాశక్తి, వివేచనా జ్ఞానం పూర్తిగా నశించాయి. పరిష్కార మార్గాన్ని ఆలోచించడానికి ఏ మాత్రం సావకాశం ఇవ్వని నా కన్ఫ్యూజింగ్ మైండ్ అవివేకపు చర్యే అయినా క్షణకాలమైనా ఆలశ్యం చేయకుండా ఆ నోట్లను తగలబెట్టమనే ఆదేశించింది. యుక్తాయుక్త విచక్షణ లేకుండా అలవరచుకొని అవలంబించి, అనుసరించే కొన్ని హాబీలు కూడా అనర్థాలు తెస్తాయని అనుభవానికి వచ్చేవరకు గ్రహించలేని నా అంతరాత్మ కొత్తదైనా పాతదైనా వెయ్యి నోటు విలువ వెయ్యి రూపాయలే తప్ప వెయ్యిన్నొక్కటి కాబోదని హెచ్చరించింది. ఆటపట్టించడానికి మిత్ర బృందం తరచూ చేసే కామెంట్ 'వందనోటు విలువ కొత్తదైనా, పాతదైనా నూరు రూపాయలే తప్ప నూరున్నొక్కటి, కాబోదు, సుబ్బారావ్!' అన్న మాటలు నా చెవుల్లో రింగుమన్నాయ్.

★



## కత్రినా సిన్సియారిటీ

**షూటింగులకి ఆలస్యంగా వచ్చే తారలు, సడెన్‌గా దుమ్మా కొట్టే ఆర్టిస్టులు తమ కారణంగా ఆరోజు నిర్మాతకు కలిగిన నష్టాన్ని గురించి పట్టించుకోరు. కానీ కొంతమంది మాత్రం సిన్సియర్‌గా వుంటారు. అలాంటి వాళ్లలో కత్రినాని కూడా చేర్చవచ్చు. ఇటీవల ఓ చిత్రం షూటింగ్ హాజరు కాలేకపోయిందిట కత్రినా, కారణం డైలాగులు పెద్దగా వుండడంతో బట్టీ పట్టలేక చిత్రీకరణకు సిద్ధం కాలేదట. షూటింగ్ కాన్సిల్ కావడానికి తనే కారణం అని తెలుసుకున్న కత్రినా ఆ నిర్మాతకి *15* లక్షల రూపాయలను ఇచ్చి సారీ చెప్పిందిట. ఆమె తీరుకు ఎంతో చలించిపోయిన ఆ నిర్మాత ఆమె ఇవ్వచూపిన మొత్తాన్ని తీసుకోలేదట.**